క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కిట్స్‌క్రాస్, ఎర్రగట్టుగుట్ట,, నారాయణనగర్, మంత్రపురి కాలనీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, లైన్‌షిఫ్టింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ప్రదీప్‌కుమార్ కోరారు.

భద్రకాళి ఆలయంలో జనగామ అడిషనల్ కలెక్టర్ పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ దంపతులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ స్నపన మందిరంలో వేదపండితులు మహాదాశీర్వచనం చేశారు. పూజా కార్యక్రమాలను ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



ధర్మేందర్



ప్రశాంత్‌కుమార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగంలో ఇద్దరు పరిశోధకులు పి.ధర్మేందర్, జేకే.ప్రశాంత్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్లను ప్రకటించింది. స్టడీ ఆఫ్ కంట్రోల్డ్ డ్రగ్ డెలవరీ థ్రో పాలిమెరిక్ మ్యాట్రిసెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పల్లెర్ల ధర్మేందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.జ్యోతి పర్యవేక్షణలో ఆయన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే కెమిస్ట్రీ విభాగంలో సింథసిస్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ సాలిడ్ యాసిడ్ క్యాటలిస్ట్స్ ఫర్ ఆర్గానిక్ రియాక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జేకే.ప్రశాంత్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఐఐసీటీ ప్రొఫెసర్ మహిపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రశాంత్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బెస్ట్ న్యూరో అవార్డు గ్రహీత డాక్టర్ ఓంప్రకాశ్‌కు సన్మానం



హన్మకొండ అర్బన్: శ్రీశ్రీ న్యూరో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఓంప్రకాశ్‌కు ఉత్తమ న్యూరో డాక్టర్ అవార్డు లభించింది. ఈమేరకు ఢిల్లీలోని ఐబీఏ సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా డాక్టర్ ఓంప్రకాశ్‌ను డాక్టర్ రామకృష్ణ, తదితరులు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ కేకే.చౌదరి, డాక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఆదర్శం అరుణ్



హన్మకొండ చౌరస్తా: మారుమూల అటవీ ప్రాంతంలో జన్మించి డాక్టరేట్ పట్టా పొందిన మైపతి అరుణ్‌కుమార్.. ఆదివాసీలకు ఆదర్శంగా నిలిచారని సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యెశబోయిన సాంబయ్య యాదవ్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన అరుణ్‌కుమార్‌ను పలు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్, మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ జన్మదిన వేడుకలు



వరంగల్: భారతీయ జనతా పార్టీ తాజా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ తూర్పు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ నాయకుడు వన్నాల వెంకటరమణ ఆదేశాలతో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించినట్లు 13వ డివిజన్ అధ్యక్షుడు జన్ను సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గోవింద్‌సింగ్, బైరి హరీష్, హనుమంతరావు శర్మ, కోట సతీష్, జన్ను సరోజ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా రైల్వే క్వార్టర్స్

- శిథిలావస్థకు చేరిన భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- దృష్టి సారించని రైల్వే అధికారులు, పోలీసులు



కాజీపేటలో శిథిలావస్థకు చేరిన రైల్వే క్వార్టర్స్

కాజీపేట: రైల్వే ఉద్యోగుల కుటుంబాలు నివాసం ఉండేందుకు రూ.లక్షల వ్యయంతో నిర్మించిన క్వార్టర్స్‌ను మందుబాబులు అడ్డాగా మార్చుకుంటున్నారు. కాజీపేట, కడిపికొండ రైల్వే బ్రిడ్జిలకు సమీపంలో ఉన్న భవనాల్లో చాలా భవనాలు శిథిలావస్థకు చేరాయి. వాటిలో కొన్నింటిలో నివాసం ఉండడానికి రైల్వే కార్మికులు ఇష్టపడడం లేదు. దీంతో నిరుపయోగంగా మారిన క్వార్టర్స్‌ను వేదికగా మార్చుకుని మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

క్వార్టర్స్ ఉపయోగంలో లేకపోవడంతో సర్కార్ తుమ్మలు, పిచ్చి చెట్లుగా ఏపుగా పెరగడంతో రాత్రి వేళ అటుగా వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న మందుబాబులు మహిళలతో క్వార్టర్స్‌లోకి రావడం, మందు పార్టీలతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల నలుగురు యువకులు గంజాయి సేవిస్తుండగా రహిమత్‌నగర్ వాసులు పట్టుకుని దేహశుద్ధి చేయగా కాళ్లవేళ్ల పడటంతో హెచ్చరించి వదిలేసినట్లుగా పట్టణంలో ప్రచారం జరుగుతోంది. అలాగే, ఇటీవల రైలు ట్రాక్‌పై కూర్చొని మందు, గంజాయి సేవిస్తున్న యువకులను ఆర్పీఎఫ్ ఎస్సై హెచ్చరించగా, అతనిపై వారు దాడికి తెగబడ్డారు. ఇలా ఈ క్వార్టర్స్ మందుబాబుల జల్సాలకు ఉపయోగపడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

భయపడుతున్న స్థానికులు

చీకటి పడితే క్వార్టర్స్ వైపు అడుగిడటానికి భయంతో వణికిపోయే పరిస్థితులున్నాయి. గతంలో ఈ క్వార్టర్స్‌లో పలు గుర్తు తెలియని మృతదేహాలు బయటపడిన సందర్భాలున్నాయి. ఆ శవాల ఆచూకీ నేటికి లభించలేదు. రైల్వే అధికారులు, పోలీసుల నిఘా కొరవడటంతో ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి వ్యర్థాలను పడేసి వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ పోలీసులు కొద్దిరోజుల పాటు తరచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ : రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వద్దు.. మూడు గంటలు చాలు అని వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నగరంలోని పార్టీ కార్యాలయం నుంచి కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అందిస్తున్న పథకాలను దేశవ్యాప్తంగా రైతులకు అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రైతు వ్యతిరేక పార్టీలని ఆయన మండిపడ్డాడు. రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఆందోళన చేపడితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక మంది రైతులు పొట్టనపెట్టుకుందని, వారి మంత్రుల కొడుకుల వాహనాలతో తొక్కించి రైతులను హత్య చేశారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పాతర పెటడం ఖాయమన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉండన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పే వరకు నిరసనలు కొనసాగుతాయన్నారు. కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి, నాయకులు పులి రజినీకాంత్, నయీమొద్దీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. 65వ డివిజన్ చింతగట్టులోని పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి అతిథిగృహంలో మంగళవారం డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈనెల 19న డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యవతి రాథోడ్ హాజరవుతున్నట్లు చెప్పారు. అనంతరం బీజీఆర్‌లో జరిగే డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఏరుకొండ శ్రీనివాస్, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ నాగరాజు, మాజీ సర్పంచ్ చుంచు రవిందర్, పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు విజేందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ మద్దతు కోరిన సీపీఎస్ నాయకులు



రామన్నపేట: టీఎన్జీవోస్ నాయకులకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎస్ యూనియన్ నాయకులు



వరంగల్ అర్బన్: వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

రామన్నపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర'కు టీఎన్జీవోస్ నాయకులు మద్దతుగా తెలుపాలని సీపీఎస్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుల జీవన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రవీందర్, శ్రీనివాస్, నాయకులు కోరారు. ఈమేరకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గజ్జల రామ్‌కిషన్, గాజే వేణుగోపాల్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలోనే మొదటి ప్రాధాన్యతగా 'సీపీఎస్ అంతం – టీఎన్జీవోస్ పంతం' అని తీర్మానం చేసినట్లు తెలిపారు. సీపీఎస్ యూనియర్ జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, ఉపాధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, జి.రాజు, దుర్గారావు, సిటీ అధ్యక్షుడు వెలిశాల రాజు, ఎంజీఎం అధ్యక్షుడు రవికుమార్, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీలావతి, తిరుమలదేవి, మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్ల విడుదల

వరంగల్ అర్బన్: పాత పింఛన్ సాధన కోసం ఆగస్టు 12న తలపెట్టిన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని బల్దియా జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 21న వరంగల్, హనుమకొండ జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీని ఉద్యోగులు జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎస్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి రవీందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు షేక్ అఫ్జల్, వెంకటస్వామి, పెరుగు శ్రీనివాస్, బల్దియా వింగ్ అధ్యక్షుడు రావుల ఆనంద్ కుమార్, జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, నాయకులు గోల్కొండ శ్రీను, బాకం సంతోష్‌కుమార్, బొట్ల రమేష్, రాజారపు భాస్కర్ పాల్గొన్నారు.

నిస్సార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



నిస్సార్‌కు నివాళులర్పిస్తున్న కళాకారులు

ఖిలా వరంగల్: సామాజిక సమస్యలే కేంద్రంగా సమాజ చైతన్య గీతాలు రాసి ఆలపించిన మహ్మద్ నిస్సార్‌ను నేటితరం ప్రజా కళాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ సీపీఐ తమ్మెర భవనంలో దామెర కృష్ణ అధ్యక్షతన మహ్మద్ నిస్సార్ మూడో వర్ధంతి సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ పేదరికంలో పుట్టిన నిస్సార్.. చిన్నతనం నుంచే సమాజాభివృద్ధి కోసం పాటుపడ్డారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలు నేటితరం కళాకారులు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నిర్మాణ బాధ్యులు, గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్, ఆరెల్లి రవి, జన్ను రవి, సుప్రియ, మున్ని, హరిబాబు, లక్ష్మి, రేణుక, నీలిమ, శారద, నవ్య, మంజుల, లలిత, వసంత, భిక్షపతి, సుప్రజ, శ్రీకన్య, ఎల్లమ్మ, ఆరోగ్యం, సరోజన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో వైద్య సేవలందించండి

ఎంజీఎం: వైద్యం కోసం వచ్చే వయోవృద్ధుల పట్ల పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యాధికారులు, ఇతర సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ మర్యాదపూర్వకమైన సేవలందించాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు సూచించారు. హనుమకొండ జిల్లాల పరిధిలోని పీహెచ్‌సీ వైద్యాధికారులకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం –2007, నియమావళి –2011పై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి చట్టం నిర్దేశించిన విధంగా సీనియర్ సిటిజన్లకు వైద్య సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో దామోదర్, తేరాల యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు హద్దులు నిర్ధారించాలి

హసన్‌పర్తి: దేవన్నపేటలోని పడమటి, బంధం చెరువులకు హద్దులు నిర్ధారించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ కోరారు. ఈమేరకు హనుమకొండ ఆర్డీఓ వాసుచంద్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు కబ్జాలతో చెరువు శిఖం కుచించుకుపోతోందని పేర్కొన్నారు.

గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఎన్నికలు

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. 37 మంది విద్యార్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో 33మంది నామినేషన్లు విత్‌డ్రా చేసుకోగా, నలుగురు విద్యార్థులు బరిలో నిలిచారు. బాలుర నుంచి రాథోడ్ (చెట్టు గుర్తు), దగ్గు అభినవ్ (గ్రాడ్యుయేషన్ క్యాప్), బాలికల నుంచి పల్లె సుమనశ్రీ (చెట్టు), పూరుగొండ లక్ష్మి (గ్రాడ్యుయేషన్ క్యాప్) గుర్తులు కేటాయించారు. ఈ ఎన్నికలకు చీఫ్ ఎన్నికల కమిషన్‌గా గ్రీన్‌వుడ్ విద్యాసంస్థల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రభుకుమార్, స్పెషల్ ఆఫీసర్‌గా నవీన్‌కుమార్ వ్యవహరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కరీమాబాద్: ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



ఖిలా వరంగల్: ఆయిల్‌బాల్స్ వేస్తున్న అరుణ

కరీమాబాద్: ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డివిజన్‌లోని నానామియాతోటలో బల్దియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ కోసం మందును మంగళవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నీరు నిల్వఉన్న చోట దోమల ఉధృతి పెరుగుతుందని, తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ మాధవరెడ్డి, సూపర్‌వైజర్ మాదాసు సాంబయ్య, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, శివకుమార్, సతీష్, దయాకర్, ప్రశాంత్‌బాబు, కిరణ్‌చంద్ తదితరులున్నారు.

దోమల నివారణకు చర్యలు

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో బల్దియా పారిశుద్ధ్య అధికారుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ నేతృత్వంలో దోమల నివారణకు మంగళవారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మురుగునీటి కుంటలు, కచ్చా డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఆయిల్‌బాల్స్ వేసి పిచికారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ డివిజన్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య, సుధాకర్, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డివిజన్‌లోని ప్రతీ బూత్‌లో యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలను కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం నాయిని మాట్లాడుతూ గతంలో పేదలకు కాంగ్రెస్ చేసిన సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, నాయకులు బొమ్మతి విక్రమ్, సతీష్, మోహన్, లచ్చన్న, తిలక్, అనిత, రాజేశ్వరి, స్వప్న, శివ, రేణుక, మానస, వరుణ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబమూర్తి

కరీమాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బంద్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి కోరారు. గ్రేటర్ పరిధిలోని రంగశాయిపేట డీవైఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సాంబమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9ఏళ్లు గడుస్తున్నా విద్యారంగం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించలేదని, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. సమావేశంలో బొక్క చిరంజీవి, తాత స్వాతి, బేతి రాజేష్, దూడం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న కిషన్

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్వేరోస్ ఇంటర్నేషనల్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లా కిషన్ అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. స్వేరోస్ డిజిటల్ కమాండో (ఎస్‌డీసీ), బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో వారం రోజులుగా కాకతీయ యూనివర్సిటీ మైదానంలో జరుగుతున్న ఆర్ఎస్పీ కప్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా కిషన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగులు, క్రీడాకారులు.. మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు, రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బజాజ్ –11 జమ్మికుంట, హూ ఈస్ నెక్స్ట్ వరంగల్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటేరు చక్రి, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, స్వేరోస్ డిజిటల్ కమాండో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ తేళ్లూరి సురేష్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు తిరుపతి నాయక్, శ్రావణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమ్మెకు సర్కార్ షాక్

- రోజువారీ పద్ధతిలో కార్మికుల నియామకం
- పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు

హసన్‌పర్తి: గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు సర్కార్ షాక్ ఇచ్చింది. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలకు ఉపక్రమించింది. తాగునీటి సమస్య, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్మికులు వివరాలు, ఎంతమంది కార్మికులు సమ్మె చేస్తున్నారు?, సమ్మెకు వెళ్లని వారు ఎంత మంది ఉన్నారనే వివరాలను ప్రభుత్వం సేకరించింది. ఈక్రమంలో రోజువారీగా వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు హసన్‌పర్తి మండల పంచాయతీ అధికారి రవిబాబు తెలిపారు.

రోజువారీ పద్ధతిలో కార్మికుల నియామకం

ఆయా పంచాయతీల్లో రోజువారీ పద్ధతిలో కార్మికులను నియమించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. హసన్‌పర్తి మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో 54 మంది కార్మికులు పలు రకాల పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 46 మంది కార్మికులు సమ్మెకు దిగారు. అందులో సీతంపేటలో ఆరుగురు కార్మికులు ఉండగా, ఇందులో కేవలం ఒక్కరు మాత్రమే సమ్మె చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే, కొత్తపల్లిలో ఇద్దరు, జయగిరిలో ఒక్కరు పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 10 మంది కార్మికులను రోజువారి పద్ధతిలో నియమించారు. ఆయా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని నియమించిన కార్మికుడికి వేతనం అందజేయనున్నట్లు అధికారులు వివరించారు.

కార్మికులుగా మహిళా సర్పంచ్‌ల భర్తలు

కొన్ని గ్రామ పంచాయతీల్లో మహిళా సర్పంచ్‌ల భర్తలే కార్మికులుగా పనిచేస్తున్నారు. మండలంలోని సిద్దాపురం సర్పంచ్ ధనలక్ష్మి భర్త జనగాని కిరణ్ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా ఆయా కాలనీలకు నీరు సరఫరా చేస్తున్నారు. అన్నాసాగరం, మడిపల్లి, జయగిరి గ్రామ మహిళా సర్పంచ్‌ల భర్తలు కార్మికులుగా అవతారమెత్తారు. ఇదిలాఉండగా జీపీ సిబ్బంది సమ్మె మాత్రం యథావిధిగా కొనసాగుతోంది.

20న 'బహుజన విద్యార్థి గర్జన సభ'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 20వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించనున్న బహుజన విద్యార్థి గర్జన సభకు విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఎస్పీ వరంగల్ రీజియన్ సెక్రటరీ కన్నం సునీల్ పిలుపునిచ్చారు. ఈమేరకు సభ కరపత్రాలను నేరెళ్ల కళాప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ తెలంగాణ చీఫ్, సీఎం అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో సాగుతున్న ప్రజా ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జోనల్ కన్వీనర్ అడ్లూరి పద్మ, బాధ్యులు బొల్లెపల్లి సారయ్య, శనిగరపు రాజు, మంద శ్యాం, వనం మహేందర్, మాదారపు రవికుమార్, జన్ను భరత్, చాతళ్ల వేణుగోపాల్, జన్ను అనిల్, బోసు మల్లేశ్వరి, దరిగి ధనరాజ్, కందుకూరి కిశోర్, వేల్పుల శంకర్, మామిండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి శివారులోని రేణుక ఎల్లమ్మకు భక్తులు మంగళవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శంకరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సప్తవర్ణ రంగులతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అందించిన నూతన వస్త్రాలతో దేవతామూర్తులకు అలంకరణ చేశారు.

అంజన్నకు లక్షపూలతో అలంకరణ

కాజీపేట: ఆషాఢమాసం మంగళవారాన్ని పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు జరిపించి, సింధుర లేపనం చేసి లక్షపూలతో అలంకరించారు.